## రుత్‌జార్



ఆస్ట్రియా దేశపు రాజధాని వియన్నాలోని ఒక ఖరీదైన హోటల్‌లో నుండి బయటకు వచ్చింది రుత్‌జార్.

మోకాళ్ల కింది వరకూ ఉన్న బూడిద రంగు స్కర్ట్, దానిపైన లేత గోధుమ రంగు కోటు, కాళ్లకు హైహీల్స్ చెప్పులు, కళ్లకు ఖరీదైన కూలింగ్ గ్లాసెస్, చేతిలో మొసలి చర్మంతో చేసిన హ్యాండ్‌బ్యాగ్... చూడగానే అధునాతనమైన స్త్రీగా గుర్తించే అన్ని హంగులతో ఉంది ఆమె. ఆమె హోటల్ నుండి బయటకు వచ్చి తిన్నగా అక్కడికి దగ్గరలో ఉన్న టాక్సీ స్టాండుకు చేరుకుంది.

ఆమె ఎక్కిన టాక్సీ వియన్నా ఎయిర్‌పోర్టుకు చేరుకోవడానికి అరగంటకు కాస్త పైగానే పట్టింది. ఎయిర్ పోర్టులోని విజిటర్స్ లాంజ్‌లో కూర్చుని మరో అరగంట సేపు వెయిట్ చేసిందామె. ఈలోగా దక్షిణాఫ్రికా రాజధాని ప్రటోరియా నుండి వచ్చే విమానం మరో అయిదు నిమిషాల్లో లాండ్ కాబోతున్నట్టుగా విమానాశ్రయపు మైకుల్లో నుండి ప్రకటన విన్పించింది. మరి కొద్ది సేపట్లో వచ్చి ఆగిన విమానంలోంచి దిగిన ఆమె భర్త కామడోర్ గెర్‌హార్ట్ కస్టమ్స్ చెక్ పూర్తి చేసుకుని తిన్నగా ఆమె దగ్గరికి వచ్చాడు.

"ఎనీ థింగ్ ఈజ్ రాంగ్?" ఆమె దగ్గరకు రాగానే మొదటి ప్రశ్నగా అడిగాడతను.

అలాంటిదేం లేదన్నట్టుగా ఆమె తల అడ్డంగా ఊపుతూ "ఎవిరీ థింగ్ ఈజ్ ఓకే..." అంది.

అంతకు రెండు రోజుల క్రితమే దక్షిణాఫ్రికా నుండి వచ్చి వియన్నాలో మకాం వేసిందామె. రెండు రోజుల తరువాత గెర్‌హార్ట్ అక్కడికి చేరుకున్నాడు. ఇద్దరూ ఒకేసారి కలిసి వస్తే అనవసరంగా అనుమానాన్ని కలిగించడానికి ఆస్కారం ఉందని గ్రహించిన వాళ్లు ముందు జాగ్రత్త చర్యగా ఎవరికీ అనుమానం రాని విధంగా ఒకరి తరువాత ఒకరుగా అక్కడికి చేరుకున్నారు.

ఆరోజు సాయంత్రమే అక్కడినుండి వాళ్లు రష్యాకు వెళ్లారు. వాళ్ల కోసమే ఎదురు చూస్తున్న రష్యా మిలటరీ ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్ (గ్రూ) ఏజంట్లు వెంటనే వాళ్లను కలుసుకున్నారు. తమతోపాటు తెచ్చిన, దక్షిణాఫ్రికా నౌకా దళానికి చెందిన సీక్రెట్ డాక్యుమెంట్లను వారికి అందించారు గెర్‌హార్ట్, రుత్‌జార్‌లు. దానికి ప్రతిఫలంగా గ్రూ ఏజంట్లు చెల్లించిన డబ్బును స్విస్‌బ్యాంక్‌లో డిపాజిట్ చేయడానికి తగిన ఏర్పాట్లు పూర్తి చేసుకుని మరో రెండు రోజులు అక్కడే ఉండి ఆ తరువాత తిరిగి దక్షిణాఫ్రికాకు వెళ్లి పోయారు వాళ్లు.

# ఏజెంట్ X

## యెదుళ్ల సురేష్ రెడ్డి

* * *

దక్షిణాఫ్రికా నౌకాదళ అధికారి అయిన గెర్‌హార్ట్ నిజానికి రష్యా గూఢచారి. దక్షిణాఫ్రికా నౌకాదళంలో చేరకముందు అతను బ్రిటిష్ నేవీలో పని చేసేవాడు. అక్కడే అతను రష్యా ఇంటెలిజెన్స్ వారితో సంబంధాల్ని ఏర్పరచుకున్నాడు. కేవలం మిలటరీ రహస్యాలే కాకుండా అక్కడి రాజకీయ, ప్రభుత్వ పాలసీలకు సంబంధించిన ఎన్నో రహస్యాల్ని అతను రష్యాకు చేరవేశాడు. అతని భార్య రుత్‌జార్ అతనితోపాటే రష్యా గూఢచారిగా చాలా కీలకమైన బాధ్యతల్ని పోషించింది. తన భర్త సంపాదించిన రహస్యాల్ని రష్యా ఇంటెలిజెన్స్ వారికి చేరవేయడంలో ఆమె ముఖ్యపాత్ర వహించింది. ఇద్దరూ కలిసి ఎన్నో కీలకమైన రహస్యాల్ని రష్యాకు చేరవేశారు. దానికి వారికి చాలా పెద్ద ఎత్తున ప్రతిఫలం ముట్టేది. గెర్‌హార్ట్ తన ఉద్యోగంలో ఉన్నత స్థానాలకు చేరుకునే కొద్దీ రష్యా ఇంటెలిజెన్స్ వర్గాలు అతనికి చెల్లించే మొత్తాన్ని కూడా భారీగా పెంచేశాయి. దానితోపాటే అతను అందించే రహస్య సమాచారం కూడా చాలా ప్రాముఖ్యం కలదిగా ఉండేది. తను రష్యా గూఢచారిగా పని చేయడమే కాకుండా రాయల్ నేవీలో పనిచేసే ఎంతోమంది ఉద్యోగుల్ని అతను రష్యా గూఢచారులుగా మార్చివేశాడు. తరువాత వాళ్లందర్నీ దక్షిణాఫ్రికాలో తయారవుతున్న బ్రిటన్ అణు జలాంతర్గాముల విభాగంలో ప్రవేశపెట్టాడు. వారి ద్వారా సంపాదించిన రహస్యాలనే కాకుండా యుద్ధ నౌకలు, వాటికి సంబంధించిన టెక్నాలజీ, బ్రిటన్ నుండి దక్షిణాఫ్రికాకు సరఫరా అవుతున్న ఆయుధాలకు సంబంధించిన వివరాలు లాంటి ఎన్నో రహస్యాల్ని అతను రుత్‌జార్ ద్వారా రష్యా మిలటరీ ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్‌కు చేరవేశాడు.

ఆ తరువాత దక్షిణాఫ్రికా నౌకాదళంలో చేరిన అతను క్రమంగా అక్కడి సైమన్స్ టౌన్‌లోని నౌకా స్థావరానికి ప్రధానాధికారిగా నియమించబడే స్థాయికి ఎదిగాడు. ఆ తరువాత అతని కార్యకలాపాలు మరింతగా పెరిగాయి. అక్కడి నౌకాస్థావరంలోని ముఖ్యమైన డాక్యుమెంట్లనన్నింటినీ ఇంటికి తీసుకు వెళ్లి అతను అక్కడ వాటిని కాపీ చేసేవాడు. ఎవరికీ అనుమానం రాని విధంగా రుత్‌జార్ వాటిని రష్యాకు చేరవేసేది. ఎన్నోసార్లు ఇద్దరూ కలిసి ఆస్ట్రియా ద్వారా రష్యాకు చేరుకుని అక్కడి రష్యా ఏజంట్లను కలుసుకునేవారు. తాము ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌మిటర్ల ద్వారా రష్యా ఏజంట్లతో తరచూ సంభాషించేవారు. ఆ విధంగా దక్షిణాఫ్రికా గూఢచార వర్గాలకు సంబంధించిన సమాచారాన్ని, ఫ్రాన్స్ నుండి దక్షిణాఫ్రికాకు దిగుమతి అవుతున్న మిసైల్స్‌కు సంబంధించిన వివరాల్ని ఇంకా మరెన్నో కీలకమైన రహస్యాల్ని వాళ్లు రష్యాకు చేరవేశారు.

ఆ విధంగా దాదాపు ఇరవై సంవత్సరాలపాటు వారి గూఢచర్య కార్యకలాపాలు ఎవరికీ అనుమానం రాని విధంగా నిర్విఘ్నంగా కొనసాగాయి.

* * *

**1983**, జనవరి మొదటి వారం...

రష్యా నుండి వలస వచ్చి పశ్చిమ యూరప్‌లో తలదాచుకుంటున్న బోరిస్ అనే గూఢచారి ఆ రోజు అక్కడి అమెరికా, బ్రిటన్ ఇంటెలిజెన్స్ అధికారుల్ని కలుసుకున్నాడు. నిజానికి అతని అసలు పేరేమిటో ఎవరికీ తెలియదు. రష్యా నుండి వలస వచ్చినప్పటి నుండి అతని అసలు ఐడెంటిటీ ఎవరికీ తెలియకుండా జాగ్రత్తలు తీసుకోబడ్డాయి. గూఢచార వర్గాలు మాత్రం ముద్దుగా అతన్ని బోరిస్ అని పిలుస్తుంటాయి. కె.జి.బి. కార్యకలాపాల గురించి ఎన్నో వివరాలు తెలిసిన అతను అందించిన సమాచారంతో పశ్చిమ యూరప్ దేశాల్లోని ఎంతోమంది కె.జి.బి. గూఢచారుల రహస్యాలు బట్టబయలయ్యాయి. అతను అందించిన వివరాల ద్వారా ఇటలీ, ఫ్రాన్స్ లాంటి యూరప్ దేశాల్లో తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్న ఎంతోమంది రష్యా గూఢచారుల్ని ఆ ప్రభుత్వాలు బలవంతంగా దేశం నుండి బహిష్కరించాయి.

అలాంటి అతను ఆరోజు చెప్పిన వివరాల్ని విని బ్రిటన్, అమెరికా ఇంటెలిజెన్స్ అధికారులు విస్మయంతో కదిలి పోయారు. అతను చెప్పిన దాని ప్రకారం దక్షిణాఫ్రికా నౌకాదళంలో చాలా ఉన్నత స్థాయిలో ఉన్న గెర్‌హార్ట్ రష్యా గూఢచారి అన్న విషయాన్ని వాళ్లు అంత తొందరగా నమ్మలేక పోయారు. వెంటనే ఆ విషయాన్ని వాళ్లు దక్షిణాఫ్రికా ప్రధానమంత్రి కార్యాలయానికి చేరవేశారు.

సైమన్స్ టౌన్ నౌకా స్థావరంలోని ప్రధానాధికారి గెర్‌హార్ట్ రష్యా గూఢచారి అని ఒకేసారి అమెరికా, బ్రిటన్ ఇంటెలిజెన్స్ వర్గాల నుండి వచ్చిన వార్తల్ని చూసి దక్షిణాఫ్రికా ప్రభుత్వాధికారులు నివ్వెర పోయారు. మరుక్షణం దక్షిణాఫ్రికా ఇంటెలిజెన్స్ ఏజన్సీ బి.ఓ.ఎస్.ఎస్. (బ్యూరో ఆఫ్ స్టేట్ సెక్యూరిటీ) ఏజంట్లు రంగంలోకి దిగారు. గెర్‌హార్ట్ కదలికల్ని అనుక్షణం గమనించేలా చర్యలు తీసుకున్నారు.

ఈ విషయాలేవీ తెలియని గెర్‌హార్ట్ ఆ మరుసటి వారం దక్షిణాఫ్రికా రాజధాని ప్రెటోరియా నుండి న్యూయార్క్‌కు వెళ్లాడు. అక్కడ ఒక ఖరీదైన హోటల్లో బసచేసిన అతన్ని అమెరికా, బ్రిటన్ ఏజంట్ల బృందం అరెస్టు చేసింది. అతని అరెస్టు వార్త బయటకు పొక్కకుండా చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. రష్యా గూఢచార వర్గాలు సైతం ఈ విషయాన్ని పసిగట్టలేక పోయాయి. న్యూయార్క్‌లోని ఒక రహస్య ప్రదేశంలో ఉంచిన అతన్ని అమెరికా, బ్రిటన్ ఏజంట్లు దాదాపు పదకొండు రోజులపాటు ఇంటరాగేట్ చేశారు. అందులో అతని నోటి నుండి మొత్తం రహస్యాలన్నీ బయట పడ్డాయి. ఆ తరువాత వాళ్లు అతన్ని దక్షిణాఫ్రికా ప్రభుత్వానికి అప్పగించారు. ఈలోగా దక్షిణాఫ్రికా ప్రభుత్వం అతని భార్య రుత్‌జార్‌ని అరెస్టు చేసింది.

తమ నేరాల్ని అంగీకరించి తమకు క్షమాభిక్ష ప్రసాదించాల్సిందిగా వేడుకున్న వారి అభ్యర్థనల్ని దక్షిణాఫ్రికా ప్రభుత్వం తిరస్కరించింది. దేశానికి సంబంధించిన ఎన్నో రహస్యాల్ని రష్యాకు చేరవేయడాన్ని చాలా తీవ్రంగా పరిగణించిన దక్షిణాఫ్రికా సుప్రీం కోర్టు గెర్‌హార్ట్, రుత్‌జార్‌లకు జీవిత ఖైదు విధించింది. ●

